
# జ్ఞాని

తులసి బాలకృష్ణ



**క్షణాలు రోజుల్లా...**
**నిమిషాలు సంవత్సరాల్లా...**
**గంటలు యుగాల్లా...**
**గడుస్తోంది కాలం**

**కాలు** కాలిన పిల్లిలా ఇల్లంతా చెడామడా తిరిగేస్తున్నాడు మూర్తి. క్షణాని కోసారి వీధి గుమ్మం దగ్గరకు పోయి వస్తున్నాడు. నిరాశగా తిరిగొచ్చి, నిస్సత్తువతో ఉస్సురంటూ పడక్కుర్చీలో వాలుతున్నాడు. మరో క్షణానికి ఆందోళనగా గుమ్మం దాకా పరుగు, ఆశగా రోడ్డంతా చూపు, నిరాశ, నిస్సత్తువ ...

ఈలోగా చంటాడి ఏడుపు. ఉయ్యాల దగ్గరకు వెళ్ళి వూపడం, వాణ్ణి ఎత్తుకు తిప్పడం ...

ఏమై ఉంటుంది? ఏమై ఉంటుంది!!

ఆఫీసులో ఏ ఫంక్షనైనా ఉన్నా,

ఒక అరగంట...తప్పితే గంట లేటవచ్చు గానీ ...ఎనిమిదవుతోంది. అంటే ఆఫీసు మూడు గంటలయినా ఈ మనిషి కొంపకు చేరలేదంటే ...

రోజూ లాగే తను ఒక పావుగంట అటూ ఇటూ వచ్చేస్తుంది కదాని పని పిల్లను కూడా పంపించేశాడు. ఇప్పుడు చంటాడ్నేసుకుని ఆఫీసుకువెళితే ఏం బావుంటుంది?! మరెలా? ఎంతసేపీ నిరీక్షణ!!

మళ్ళీ తిరుగుడు ...

ఆశ ...

నిరాశ ...

నిస్పృహ ...

నిస్సత్తువ ...

పడక్కుర్చీలో వాలిపోయి కణతలు రుద్దుకుంటూ, గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

"మీరింక అంతా మరిచిపోయి మామూలుగా ఉండాలి. అసలే మీ ఆయన మీరు రావడం ఇంత ఆలస్యం అయినందుకు కంగారు పడుతుంటారు."

ఉలిక్కిపడి గుమ్మం వైపు పరుగెత్తాడు మూర్తి.

వచ్చి చెప్తున్న ధోరణిలో ఇంకా ఏదో చెప్పి సీతని ఇంట్లోకి పంపించి, తమ ఇంటి వైపు వెళ్ళిపోయింది ప్రసాదరావు భార్య.

గేటు తీసుకుని కాంపౌండులోకి రెండడుగులు వేసి, చటుక్కున తలెత్తి భర్త ముఖంలోకి చూసింది సీత. ఒక్కుమ్మడిగా అంత ఆలస్యం అయినందుకు సిగ్గు, ఏదో చెప్పుకోవాలనే బాధ, గత మూడు గంటలుగా అతను, పిల్లాడు తనకు గుర్తే రానందుకు ఆశ్చర్యం కలిగాయి ఆమెలో.

విప్పారిన కళ్ళతో, భ్రుకుటి ముడిచి ఆమెనే చూస్తున్నాడు మూర్తి.

ఆమె కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్నాయి.

జుట్టు రేగిపోయి ఉంది.

మొహం జేవురించుకునుంది.

తడబడే అడుగులో తలొంచుకుని ముందు కొస్తోంది.

యథాలాపంగా పక్కకు జరిగి దారిచ్చాడు ఆమెకు.

యాంత్రికంగా లోపలకు నడిచింది సీత.

బాగ్ బల్లమీద జారవిడిచి, కుర్చీలో కూలబడింది నీరసంగా.

'ఏం జరిగింది' అని అడిగి, వివరంగా తెలుసుకోవాలనిపించినా, బలవంతంగా అణచుకుని, "అన్నం తింటావా, సీతా?" అన్నాడు మూర్తి.

అనుకోని ఈ ప్రశ్నకు ఆశ్చర్య చకితురాలయ్యింది సీత.

'ఏం జరిగింది' అనే మామూలు ప్రశ్నే వేస్తా డనుకుంది. అంతలో ఆయన ఇంతసేపూ భోజనం చేయలేదు కదా అని గుర్తొచ్చి, నొచ్చుకుంటూ లేచి, "తిందామండి. త్వరగా వంట చేసేస్తాను" అంటూ వంటింటివైపు అడుగు వేసింది. నిజానికి తనక్కూడా ఏదో తినకపోతే శోష వచ్చేటట్లుగా ఉంది.

హమ్మయ్య అనుకున్నాడు మూర్తి. 'నేను తిన్ను. మీకు వంట చేస్తాను తినండి' అదిఉంటే—'కొంప మునిగింది' అనుకునే వాడే మూర్తి. కాని ఆమె 'తిందాం' అంది. సో అంత భయపడాల్సినదేమీ జరగలేదన్నమాట. వెంటనే హుషారుగా, "ఆగాగు. నువ్వలా పడక్కుర్చీలో రెస్టు తీసుకో. ఒక్క నిమిషంలో భోజనం రెడీ. ఇప్పుడు నువ్వేం శ్రమ తీసుకో నక్కర్లేదు" అంటూనే ఒక్క గెంతులో గుమ్మం దాటి, మరో పది నిముషాల్లో పెద్ద కారేజీతో ప్రత్యక్షమయ్యాడు భార్య ముందర.

వింతగా చూసింది సీత భర్త వైపు.

'ఇప్పటికయినా ఏం జరిగిందని అడగడేం' అని గిజగిజ లాడింది.

"ఆశ్చర్యపోకు. వేరే విషయాలు కూడా ఇప్పుడేం చెప్పొద్దు. వీలయితే, వోపిగ్గా ఉంటే బట్టలు మార్చుకుని, మొహం కడుక్కుని రా. లేకపోతే ఇలాగే వచ్చేయ్. చంటాడు కూడా నిద్రపోయాడు. నిశ్చింతగా, తాపీగా భోజనం చెయ్యొచ్చు."

రెండు కంచాల్లో కారేజీలోని అన్నం, కూరలు వడ్డించాడు.

మొహం కడుక్కుని వచ్చి భర్త ముఖంలోకే చూస్తూ, గబగబా తినసాగింది సీత. ఆమె ముక్కు పుటాలు అదురుతున్నాయి. కళ్ళు ఎక్వారియంలోని ఎర్ర చేపల్లా ఉన్నాయి. భోజనం ముగిసే లోగా రెండుసార్లు ఆమె ఏదో చెప్పబోవడం, మూర్తి వారించి భోజనం చెయ్యమనడం జరిగాయి.


"ఏమి టసలు కడుపు సగం కూడా నిండినట్లు లేదే" అంటూ చూపుడు వేలితో పొడిచి కితకితలు పెట్టాడు మూర్తి, భోజనం ముగించి చేతులు కడుక్కున్నాక.

ఆపుకోలేక ఫక్కున నవ్వేయబోయి భోరున ఏడ్చేసింది సీత, భర్తను కౌగలించుకుని. ఆప్యాయంగా ఆమెను అదిమి పట్టుకుని మంచం దగ్గరకు నడిపించుకు వెళ్ళి కూర్చోబెట్టి—"సీతా! ఏం జరిగింది?" అని ఆమె కోరిన, తను తెలుసుకోవలసిన ప్రశ్న వేశాడు మూర్తి.

కట్టలు తెంచుకున్న నదిలా ఉరికి వస్తున్న దుఃఖాన్ని అదుపు చేసుకోలేక నాభి కంపించేంతగా వెక్కివెక్కి ఏడ్చింది సీత.

ఆపుచేయడానికి ప్రయత్నించలేదు మూర్తి. అలా ఏడ్చేస్తేనే భారం తీరుతుందని వూరుకున్నాడు. కాని, ఏం జరిగిందో తెలుసుకోవాలనే కుతూహలం, ఏదో చెప్పరాని భయం లోలోనే తొందర పుట్టిస్తున్నాయి.

"మా ఆఫీసరుగాణ్ణి చంపెయ్యాలండీ!" ఏడుపుతో ఆమె గొంతు జీరపోయింది.




భ్రుకుటి ముడివేస్తూ, తొందరగా అడిగాడు మూర్తి—"ఏం చేశాడు?"

"ఒళ్ళు బలిసినట్లుంది వెధవకి."

"పిచ్చిగా పేలాడా?"

"పేలితే చంపెయ్యనూ?"

"వెర్రిచూపులు చూస్తున్నాడా?"

"కళ్ళు పొడిచెయ్యనూ?"

"పెర్సనల్ లైఫ్ గురించి ఏమన్నా అన్నాడా?"

"చెప్పుచ్చు కొట్టనూ?"

"మరి? ..." అసహనంగా అడిగాడు మూర్తి, తన ప్రశ్నలకూ జవాబులే ప్రశ్నలే అయ్యేసరికి.

అదిరిపోయింది సీత ఆ అరుపుకి. ఆప్పైన బెదురు చూపులు చూపింది—'యూ టూ బ్రూటస్' అన్నట్లుగా.

దాంతో కరిగిపోయి కంగారుని, చిరాకుని చంపుకుని, "ఏం చేశాడు, సీతా?" అని అనునయం అభినయిస్తూ అడిగాడు, వీలయినంత ప్రశాంతంగా.

"ఏంచేశాడంటే ఏం చెప్తమంటారు? పొగరు బలిసిందంతే వెధవకి" అంటూ చిర్రున చీదింది.

"'ఏం జరిగింది' అని ఇక అడగలేక అసహనంగా చూస్తూ కూర్చుండిపోయాడు మూర్తి.

"వాడి పెళ్ళాం పొయ్యి దగ్గరే కూర్చునే పెంటమ్మ కాబట్టి, ఉద్యోగాలు చేసుకునే ఆడవాళ్ళ బాధలు వాడికేం తెలుస్తాయి" అంటూండగానే ఆమె గొంతు ఉక్రోషంతో వణికింది.

"వివరంగా చెప్పు, సీతా!"

"ఏముందండీ...ఆ వెధవయితేతెల్లార్పు తెల్లారకుండా ఆఫీసుకు తగలడి, ఏ అర్ధరాత్రో తిరిగి కొంపకు అఘోరిస్తాడు. కానీ, మా ఆడాళ్ళకి ఇంటి దగ్గర పనిమనిషి ముండ రాకపోతే అంట్లు తోముకు చావాలి. మొగుడు గారికి గెడ్డం గొరుక్కుందుకు నీళ్ళు దగ్గరుండి అందించాలి. చంటి వెధవకి ఇక సరేసరి. సర్వం చూసుకు చావాలి. మాకెలా వీలవుతుందీ? ..."

"నిజమే — ఇవ్వాళ ఏమయింది?"

"ఈ రోజే కాదండీ ... మొన్నటికి మొన్న చంటి వెధవతో కుదరక ఒక రెండు గంటలు లేటుగా వెళితే ... నాకు వినీ వినబడకుండా సణుక్కు చచ్చాడు."

"ఎవరూ—మీఆఫీసరు సత్తిగాడే?"

"ఆఁ వాడే!"

"హరి వెధవా! అంతవాడయ్యాడా?" అని ఆశ్చర్యం ప్రకటించాడు మూర్తి.

"నిన్న తీరా ఆఫీసులోకి అడుగు పెడ్తుంటే మా చిన్న నాటి స్నేహితురాలు మంగతాయారు కనబడిందండీ.

